సేంద్రియం వైపు.. అన్నదాత చూపు

- రసాయన ఎరువుల వినియోగంతో తగ్గిన భూసారం
- పంట ఉత్పత్తులు తగ్గుముఖం
- నష్టనివారణకు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుతున్న రైతాంగం

పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో సేంద్రియ సేద్యం పెరుగుతోంది. భూసారం పెంపొందించే ప్రకృతి విధానాలపై రైతాంగం మొగ్గుచూపుతోంది. సహజ ఎరువులను వాడేందుకు ఆసక్తి కనబరుస్తోంది. రసాయన పురుగు మందుల స్థానంలో వేప కషాయం.. జీవామృతం వినియోగించి నాణ్యమైన పంటలను సాగు చేస్తోంది. ఆరోగ్యకరమైన ఉత్పత్తులతో అధిక దిగుబడి సాధిస్తోంది.

పలమనేరు : జిల్లాలోని పడమటి ప్రాంతమైన పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో అధికంగా మెట్ట భూములే ఉన్నాయి. ఇవి పూర్తిగా వర్షాధారంతోనే సాగు చేస్తున్నారు. చదును భూములు చెరువుల కింద బోర్లకింద ఉన్నాయి. ఖరీఫ్‌లో ఎక్కువగా వేరుశనగ సాగవుతుంది. రెండు సీజన్లలోనూ వరి, రాగులను పండిస్తారు. కూరగాయలు సాగు ఎక్కువగా ఉంటుంది.

రసాయన ఎరువుల వినియోగం

పలమనేరు నియోజకవర్గంలో టమాట, బీన్స్, బీట్‌రూట్, బంగాళాదుంప, క్యాలీఫ్లవర్, క్యాబేజీ, క్యారెట్, ముల్లంగి, రింగ్ బీన్స్, బీర, కాకర, మిరప, అరటి, బొప్పాయి, ద్రాక్ష, క్యాప్సికం, వంగ తదితర పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. కూరగాయల పంటలే సుమారు 8వేల హెక్టార్లలో సాగులో ఉన్నాయి. పంట వేగంగా చేతికందేందుకు, దిగుబడి పెరిగేందుకు రైతులు అనవసరంగా రసాయనిక ఎరువులను వాడేవారు. చీడపీడలు ఎక్కువగా సోకుతుండడంతో క్రిమిసంహారకాలను వినియోగించేవారు. ముఖ్యంగా గత నాలుగైదేళ్లలో రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం శృతి మించడంతో భూములు పూర్తిగా సారం కోల్పోయాయి. ఫలితంగా పంటలు పసుపురంగులోకి మారి ఏపుగా పెరగక అనుకున్న దిగుబడి తగ్గిపోయింది. దీంతో చాలామంది రైతులు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. దీనిపై దృష్టిసారించిన వ్యవసాయశాఖ, జిల్లా ప్రకృతిసేద్యం అధికారులు సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలని ముమ్మరంగా ప్రచారం చేశారు. స్పందించిన రైతులు సేంద్రియ విధానాలపై ఆసక్తిని పెంచుకున్నారు.


పలమనేరు మండలంలో సేంద్రియ ఎరువులతో సాగవుతున్న వరి


పుష్టిగా వెన్ను తీసిన వరి పంట



రైతులు తయారు చేసుకున్న సేంద్రియ ఎరువు


మొరం గ్రామంలో ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)


జీవామృతం సిద్ధం చేసుకుంటున్న రైతు

ప్రకృతి పద్ధతులతోనే..

మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతోనే సాగుచేస్తున్నా. ఇదివరకటి పెట్టుబడి కంటే తక్కువే అవుతోంది. మంచి దిగుబడి కూడా వస్తోంది. సేంద్రియ విధానంలో పండించిన వరి బియ్యాన్ని మా బంధువులకు కూడా పంపుతున్నాం. మార్కెట్‌లో దొరికే సూపర్ ఫైన్ రైస్ కంటే ఈ ధాన్యం శ్రేష్టం.

– సుబ్రమణ్యం నాయుడు, రంగినాయనిపల్లె, పలమనేరు మండలం



సస్యరక్షణతోనే మామిడిలో అధిక దిగుబడి

తవణంపల్లె: మామిడిలో సస్యరక్షణతోనే అధిక దిగుబడి సాధ్యమని ఉద్యానశాఖ అధికారి సాగరిక అన్నారు. మంగళవారం మండలంలోని దిగువ మాఘం ఆర్‌బీకేలో రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మామిడి చెట్లకు మొదటి దశలో మందులు పిచికారీ చేసిన రైతులు రెండవ దశలో పూత, మొగ్గదశలో పిచికారీ చేయాలన్నారు.మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ మాట్లాడుతూ, ప్రతి రైతూ విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.. మండలంలో 850 మంది రైతులు ఈకేవైసీ చే యించుకోవాల్సి ఉందన్నారు. ఈకేవైసీ చేసుకోకపోతే పీఎం కిసాన్ నిధులు అందవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపి, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి సాగరిక

మామిడికి మంచు దెబ్బ

గుడిపాల: కొన్నిరోజులుగా కురుస్తున్న పొగమంచు మూలాన మామిడి పంటకు నష్టం వాటిల్లే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. కొన్నిచోట్ల పూత రాకపోవడం, మరికొన్ని చోట్ల పూత, పిందెలు రాలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 4 వేల హెక్టార్లలో మామిడిపంట సాగులో ఉంది.ఏటా డిసెంబర్, జనవరిలో మామిడి తోటలకు పూత అధికంగా వస్తుంది. ఈ పూత వచ్చినప్పుడు వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయి. అయితే అధికంగా కురుస్తున్న మంచు మామిడి పంటను దెబ్బ తీస్తోంది. పంటపై ఆశలు వదులుకోవాల్సి వస్తొందని తోటలను కౌలుకు తీసుకున్న రైతులు చెబుతున్నారు. గత ఏడాది కూడా ఇదే పరిస్థితి కలిగిందని, ఈ ఏడాది కూడా మళ్లీ పునరావృతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.


పొగమంచు కారణంగా పూత రాలుతున్న మామిడి

రేపటి నుంచి 'గడప గడపకు'

శాంతిపురం : మండలంలోని 64 పెద్దూరు, మొరసనపల్లె పంచాయతీల్లో 19 నుంచి 22వ తేదీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీపీ వసుంధర, ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ భరత్ పాల్గొనే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆదేశించారు.

వేమన పద్యాలపై నేడు పోటీ

పలమనేరు : పట్టణంలోని కళామందిరంలో బుధవారం యోగి వేమన పద్యాలపై పోటీ నిర్వహించనున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎక్కువ పద్యాలు చెప్పిన 15మందికి నగదు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు.

రెడ్డి సంఘం సలహాదారుగా అమరనాథరెడ్డి

పలమనేరు : రెడ్డి సంఘం సలహాదారుగా పలమనేరుకు చెందిన అమరనాథరెడ్డి నియమితులయ్యా రు. మంగళవారం ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి వెంకటశివారెడ్డి ఆదేశాలు జారీ చేశా రు. అమరనాథరెడ్డి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యత తను సక్రమంగా నెరవేరుస్తానని తెలిపారు.

బోయకొండ అభివృద్ధిపై సమీక్ష

చౌడేపల్లె : బోయకొండలో చేపట్టిన అభివృద్ధి పనులపై గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ మంగళవారం సమీక్షించారు. అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఈఓ చంద్రమౌళి, పాలకమండలి సభ్యుడు జె.వెంకటరమణారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లకు స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాల మేరకు నిర్మాణాలు ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. భక్తులకు సులభతరంగా అమ్మవారి దర్శనభాగ్యం కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రద్దీ రోజుల్లో సైతం భక్తులందరికీ ప్రసాదాలు అందించేందుకు సరిపడా సిద్ధం చేసుకోవాలని కోరారు. ఆలయ పరిసరాలకు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బోయకొండ, గంగాపురంలోని దుకాణాల్లో భక్తులకు శీతల పానీయాలు, తినుబండారాలను అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో చైర్మన్ శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి తదితరులు

రేపటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

పుంగనూరు : విద్యుత్ ధరలు పెంపుపై సరఫరా, ఆదాయం తదితర అంశాలపై 19వ తేదీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు ఈఈ విజయన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు , మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు వివరించారు.

వేడుకగా ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న మహిళలు

పలమనేరు : పట్టణంలోని గంగమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం ముగ్గుల పోటీలను వేడుకగా నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురికి బహుమతులు అందించారు. 20 మందికి కన్సొలేషన్ బహుమతులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ, ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి గంగమ్మ గుడి కమిటీ చైర్మన్ కండల నరేష్ హాజరయ్యారు.

కనుమా.. కరుణించుమా..!


పశువుకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- వేడుకగా పశువుల పండుగ
- గ్రామదేవతలకు ఘనంగా పొంగళ్లు
- ఉత్సాహంగా ఎడ్ల పందేలు

వి.కోట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా పశువుల పండుగను జరుపుకున్నారు. తోటకనుమ గ్రామంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏడాదంతా కష్టించిన పశువులకు రైతన్నలు ప్రేమగా కృతజ్ఞతలు తెలపడమే కనుమ ఉద్దేశమన్నారు. అన్నదాతలు సిరిసంపదలతో వర్ధిల్లాలని కోరారు. అలాగే పడిగెలకుప్పంలో గ్రామస్తులు పశువుల పండుగను జరుపుకున్నారు. దాసార్లపల్లె, ముదిమడుగులో గ్రామ దేవతలకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

రొంపిచెర్ల: మండలంలోని పలు గ్రామాల్లో కనుమ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 6 గంటలకే యువత చల్ల తీసుకుని చెరువుల్లో వేశారు. పశువులను అలంకరించారు. చిట్లాకుప్పకు నిప్పు పెట్టి పశువులను పరుగులు తీయించారు. కాటమరాజుకు పూజలు చేశారు.

రామకుప్పం: మండలంలోని వీర్నమల లో మంగళవారం పశువుల పరుగు పందేలను కోలాహలంగా నిర్వహించారు. పోటీలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పోటీల్లో గెలిచిన పశువులకు సంబంధించిన యజమానులకు బహుమతులు అందజేశారు.


రామకుప్పం : పరుగు తీస్తున్న గిత్త


పండుగకు ముస్తాబైన పుంగనూరు జాతి ఆవులు


రొంపిచెర్లలో కాటమరాజుకు పూజలు

క్లుప్తంగా

చౌడేశ్వరిదేవికి పొంగళ్లు


శెట్టిపల్లెలో పశువులకు పూజ చేస్తున్న రైతులు

బైరెడ్డిపల్లె : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం మండలంలోని శెట్టిపల్లెలో చౌడేశ్వరిదేవి అమ్మవారికి ఘనంగా పొంగళ్లు సమర్పించారు. గ్రామానికి చెందిన మహిళలు ఉపవాస దీక్షతో పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గంగమ్మ ఆలయం వద్ద పశువులను ముస్తాబు చేసి పూజలు చేశారు. అలాగే గంగినాయనపల్లె, జాలారిపల్లె, గొల్లచీమనపల్లె తదితర గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

గీత పఠనంపై అవగాహన


మాట్లాడుతున్న సేవాసమితి సభ్యులు

బైరెడ్డిపల్లె : భగవద్గీత పఠనంపై త్రైత సిద్ధాంత సేవా సమితి అధ్యక్షులు అశోక్‌బాబు, బాలాజీ, భాస్కర్ అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని బేలుపల్లె, పిచ్చిగుండ్లపల్లె, ఎర్రకదిరేపల్లె గ్రామాల్లో వారు ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు కల్యాణి, రేఖ, ఉదయ్, వాణిశ్రీ, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

కళాతరంగిణి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సీఈఓ

బైరెడ్డిపల్లె : కడప పట్టణంలోని శిల్పారామంలో సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో బైరెడ్డిపల్లె కళాతరంగిణి సంస్థ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శాస్త్రీయ, జానపద, సాంప్రదాయ, సినీ నృత్యాలతో అలరించిన విద్యార్థులకు శిల్పారామం సీఈఓ శ్యాంసుందర్‌రెడ్డి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలందజేశారు. కళాతరంగిణి సంస్థ వ్యవస్థాపకుడు రాజేష్‌బాబును సత్కరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బైరెడ్డిపల్లె : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర సూచించారు. మంగళవారం బైరెడ్డిపల్లెలో డ్రై డేపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. చిన్నపిల్లలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే తల్లిపాలు, పౌష్టికాహారం అవసరమని తెలిపారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించాలని స్పష్టం చేశారు.

వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శికి సత్కారం


మొహిద్దీన్ బాషాను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్

పలమనేరు : వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి మొహిద్దీన్‌బాషాను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఘనంగా సత్కరించారు. మంగళవారం పట్టణ సమీపంలోని బైపాస్‌రోడ్డు వద్ద ఆయనతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మాజీ పట్టణ కన్వీనర్ మండీ సుధా పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రం అందుకుంటున్న నూతన అధ్యక్షులు

చిత్తూరు రూరల్: అఖిల భారత నాయీ బ్రాహ్మణ సంగీత కళాకారుల అసోసియేషన్ నియోజకవర్గ, మండల అధ్యక్షుల ఎన్నికపై మంగళవారం నగరంలోని ఆ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పుంగనూరు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడిగా మునిరామయ్య, యాదమరి మండల అధ్యక్షుడిగా గోవిందస్వామిని ఎన్నుకున్నారు. వారికి అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గల్ల రాజేష్, ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాష్ నియామక పత్రాలు అందజేశారు. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్షులు పేర్కొన్నారు.